

# రమాప్రభకు పెరుగుతున్న ఆదరణ

**ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల చూపు ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ రమాప్రభ వైపు కనిపిస్తోంది. మరోవైపు ప్రయివేటు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగులు, విద్యార్థుల్లోనూ అదే వాణి. ఇందుకు కారణం లేకపోలేదు. 2007లో ఏర్పడిన పిడిఎఫ్ (ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్) ఉద్యోగులు, విద్యార్థులు, నిరుద్యోగులు ఇలా ఒకటేమిటి? అన్ని తరగతులకు సంబంధించిన సమస్యలపైనా పోరాడుతోంది. చివరికి పెట్టుబడుల భాగస్వామ్యం పేరుతో చేపడుతున్న ప్రభుత్వ రంగ సంస్థల విక్రయాలను కూడా చట్టసభల్లో కేవలం పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమే వ్యతిరేకిస్తున్నారు. మరో మాటలో చెప్పాలంటే రాష్ట్రంలో శాసన మండలిలోనూ, బయట పిడిఎఫ్ ఎమ్మెల్సీలే ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వీరంతా అధికార, ప్రధాన ప్రతిపక్షాలకు గుణపాఠం నేర్పేందుకు ఉద్యోగ, ఉపాధ్యాయులు సిద్ధమవుతున్నారు.**

- ఉద్యోగ, ఉపాధ్యాయుల చూపు ఆమె వైపే...
- ప్రభుత్వ అణచివేత చర్యలు, పిడిఎఫ్ చేపట్టిన ఉద్యమాలే కారణం
- ఎమ్మెల్సీ ఎన్నికల వేళ వాడీవేడి చర్చ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఉపాధ్యాయులు, ఉద్యోగుల్లో అధిక శాతం మంది పట్టభద్రులే. వీరంతా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కీలకపాత్ర పోషించనున్నారు. వీరంతా బంధువులు, గురుశిష్య సంబంధాలు, మిత్ర బృందాలను కూడా ప్రభావితం చేయనున్నారు. ఈ నేపథ్యంలో వీరంతా ఎటువైపు ఉంటారన్న చర్చ జరగడం సర్వసాధారణం. కానీ, ఈసారి మారుమాట లేకుండా పిడిఎఫ్ బలపర్చిన డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు పట్టం కట్టేందుకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. ముఖ్యంగా ఆమె జీవితం సామాజిక సేవతో పెనవేసుకుని ఉంది. సొంత లాభం కొంత మానుకుని పొరుగువారికి పాటుపడవోయ్.. అన్న మహాకవి గురజాడ అడుగుజాడల్లో మహిళలు, గిరిజనులు, మత్స్యకారులు, పేదల సమస్యల పరిష్కారానికి విశేషంగా కృషి చేశారు. విద్యార్థులు, చిన్నారుల బంగారు భవిష్యత్తుకు తనవంత సేవలందిస్తూ ఖండాంతరాల్లో ఏర్పాటు చేసిన అనేక సదస్సుల్లో ప్రాతినిధ్యం వహించారు. ఆమె వ్యక్తిగత చరిష్మా సంగతి కాస్త అటుంచితే, పిడిఎఫ్ ఎమ్మెల్సీలు బలపర్చిన అభ్యర్థి కావడం అత్యంత కీలక అంశంగా చెప్పొచ్చు.

పిడిఎఫ్ ఎమ్మెల్సీలు అటు శాసన మండలిలోనూ, ఇటు ప్రజాక్షేత్రంలోనూ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై తమదైన శైలిలో గళమెత్తుతూనే ఉన్నారు. ముఖ్యంగా పిఆర్‌సి విషయంలో జరిగిన మోసాన్ని తేటతెల్లం చేయడంలో పిడిఎఫ్‌దే కీలకపాత్ర. మరోవైపు సిపిఎస్ రద్దు కోసం ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలంటూ ప్రభుత్వాన్ని గర్జించారు. ఈ సమస్య ప్రధాన ప్రతిపక్షమైన టిడిపికి పట్టకపోయినా, ఉద్యోగుల తరపున పిడిఎఫ్ ఎమ్మెల్సీలు నిలబడి పోరాడుతున్నారు. ప్రాథమిక విద్యా వ్యవస్థను నాశనం చేయడంతో పాటు ఇటు ఉపాధ్యాయులకు అటు డి.ఎడ్, బిఇడి పూర్తి చేసి ఉపాధ్యాయ పోస్టుల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగుల భవిష్యత్తుతో చెలగాటమాడే నూతన విద్యా విధానాన్నీ పిడిఎఫ్ ఎమ్మెల్సీలు వ్యతిరేకిస్తున్నారు. పిఆర్‌సి, సిపిఎస్, నూతన విద్యా విధానానికి వ్యతిరేకంగా పోరాడుతున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులపై ప్రభుత్వం అణచివేత చర్యలు తారాస్థాయికి చేరాయి.

పిఆర్‌సి ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ఉపాధ్యాయ లోకంపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. చలో విజయవాడ, కలెక్టరేట్ ఎదుట ధర్నాల సందర్భంగా ఉపాధ్యాయులను పోలీసులతో ప్రభుత్వం గృహ నిర్బంధాలకు గురిచేసింది. ఇప్పటికీ బెదిరింపులు, అదిరింపులు కొనసాగుతున్నాయి. వీటితోపాటు ప్రభుత్వం అనేక ఉద్యోగ వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందనేది వారి మనోగతం. ఇటువంటి పరిస్థితుల్లో అధికార, ప్రతిపక్షాలు బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థుల కన్నా తమ కోసం పోరాడే పిడిఎఫ్ బలపర్చిన రమాప్రభే మేలని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, నిరుద్యోగులు ఇలా ఒకటేమిటి చాలామంది పట్టభద్రుల్లో చర్చ సాగుతోంది.

# వేతన వేదన!

- మూడు నెలలుగా అందని జీతాలు
- రెండేళ్లుగా అందని టిఎ, డిఎలు
- కష్టంగా కేంద్రాల నిర్వాహణ
- అంగన్వాడీ సిబ్బంది కన్నీటి వ్యథ

ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు (ఫైల్)

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

గార ప్రాజెక్టు పరిధిలోని ఓ అంగన్వాడీ కేంద్రంలో దాదాపు 30 మంది పిల్లలు, 17 మంది గర్భిణులు, బాలింతలు ఉన్నారు. రోజూ మధ్యాహ్నం వంటా వార్పు చేయాలి. పప్పు దినుసులు, ఆకుకూరలు కొనడానికి అప్పు చేశారు. ఇప్పటికే రూ.20వేలు అయింది. గతేడాది ఆరు నెలల బిల్లులు బకాయి ఉంటే మూడేసి నెలలు చొప్పున రెండు విడతలుగా ఆ బిల్లులు చెల్లించారు. జనవరి నుంచి ఈవెంట్ బిల్లు సైతం రాకపోవడంతో నిర్వహణ గగనమైంది.

జిల్లాలో స్త్రీశిశుసంక్షేమ శాఖ అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ దిన దిన గండంగా మారింది. క్షేత్ర సిబ్బంది నానా అవస్థలు పడుతున్నారు. రెండు నెలలుగా కాన్మెంట్, ఈవెంట్ బిల్లులు జమ కాలేదు. వీటి కోసం ఇన్నాళ్లూ అప్పులు చేశారు. మరోవైపు అంగన్వాడీ కేంద్రాల సిబ్బందికి మూడు నెలలుగా జీతాలు చెల్లించలేదు. కుటుంబ పోషణకు ఇబ్బంది కర పరిస్థితి ఏర్పడింది. దీంతో నరకయాతన అనుభవిస్తున్నారు. ఎలా బతకాలంటూ మథన పడుతున్నారు. గొంతెత్తి అడిగితే రాజకీయ వేధింపులకు ఒడిగడుతున్నారన్న భయం సిబ్బందిని వెంటాడుతోంది. జిల్లాలో అంగన్వాడీల పరిస్థితి దయనీయంగా మారింది. డిసెంబరు, జనవరి నుంచి వేతనాలు రాలేదు. ఫిబ్రవరితో కలిపితే మూడు మాసాలు అవుతుంది. వీటికి తోడు కొందరు అంగన్వాడీలకు ఇన్‌ఛార్జి బాధ్యతలను అప్పగించారు. అదనపు బాధ్యతలు నిర్వహించేందుకు జీతం కాక, రూ.5వేలు వారికి ఇస్తున్నారు. ఈ డబ్బులు కూడా ఐదు నెలలుగా వారికి ఇవ్వడం లేదు. సొంత అంగన్వాడీ చూస్తూనే, ఇన్‌ఛార్జిగా తమ పరిధిలోని అంగన్వాడీలు చూడాల్సి రావడంతో అవస్థలు తప్పడం లేదు. దీనికి తోడు సమావేశాలకు వెళ్లేందుకు గత ప్రభుత్వం వీరికి టిఎ, డిఎలు చెల్లించేది. వైసిపి వచ్చిన తొలి నాళ్లలో ఇచ్చేవారు. ఇప్పుడు బడ్జెట్ లేదని చెప్పి రెండేళ్లుగా టిఎ, డిఎలు చెల్లించడం లేదు. దీంతో తమ జేబులోని డబ్బులు పెట్టాల్సి వస్తోందని వాపోతున్నారు.

**నెలకు రూ.4.43 కోట్లు**

ఉమ్మడి జిల్లాలో 4192 అంగన్వాడీ కేంద్రాలు ఉండగా 3409 మంది ప్రధాన కార్యకర్తలు, సహాయకులు, 732 మంది మినీ అంగన్వాడీలు పని చేస్తున్నారు. కార్యకర్తకు నెలకు రూ.11,500, ఇతరులకు రూ.7వేలు చొప్పున వేతనం చెల్లించాల్సి ఉంది. ఈ లెక్కన నెలకు రూ.4.43.81 కోట్లు అవసరం. డిసెంబరు, జనవరి, ఫిబ్రవరి నెలలకు రూ.12.27 కోట్లు బకాయి ఉంది. అదిగో.. ఇదిగో వస్తుందంటూ ఆశగా ఎదురుచూస్తున్నారు.

**రెండు నెలలుగా..**

పిల్లలు, గర్భిణులు, బాలింతలు 2.69 లక్షల మంది ఉన్నారు. ప్రతి నెలా పిల్లలకు అన్నప్రాసన, గర్భిణులకు సీమంతం(ఈవెంట్లు) చేశారు. వీటికి రెండు నెలలుగా బిల్లులు రావాలి. మరోవైపు ఆకు కూరలు, కూరగాయలు, గ్యాస్, పప్పుదినుసులు,. కాన్మెంట్ కోసం అప్పులు చేశారు. ఈ బిల్లులూ చెల్లించాలి ఉంది.

**బడ్జెట్ కోసం చూస్తున్నాం**

బకాయిలు ఉన్నమాట వాస్తవమే. బడ్జెట్ కోసం ప్రభుత్వానికి రాశాం. త్వరలోనే మంజూరు అవుతుంది. బిల్లులన్నీ సిద్ధంగా ఉంచాం. కాన్మెంట్, ఈవెంట్ల బకాయిలకు బిల్లులు పంపించాం. బిల్లులన్నీ జమ చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావాల్సి ఉంది.

**-అనంత లక్ష్మి, పీడీ, ఐసిడిఎస్**

# నిరుద్యోగ యువతకు అండగా ఉంటా

## పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ

మాట్లాడుతున్న రమాప్రభ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపిస్తే నిరుద్యోగ యువతకు అండగా ఉండి, మీ సమస్యలపై చట్ట సభలలో గొంతు వినిపించి పరిష్కారానికి కృషి చేస్తానని పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ అన్నారు. నిరుద్యోగ అభ్యర్థులకు ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో గ్రూప్ 2 అభ్యర్థులకు అవగాహన సదస్సు జరిగింది. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ హరీష్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో కృష్ణా, గుంటూరు జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సదస్సులో పాల్గొన్న రమాప్రభ మాట్లాడుతూ ఇంత వరకు పరిపాలించిన పాలకులు, నేడు పరిపాలిస్తున్న వారు ఉత్తరాంధ్రకు తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. ముఖ్యంగా యువతకు జాబ్ లెస్ క్యాలెండర్ విడుదల చేసి అన్యాయం చేసిందన్నారు. దానిపై పోరాటం చేస్తున్న విద్యార్థులు, నిరుద్యోగులపై ఎన్నో కేసులు పెట్టి కక్ష సాధింపు చేస్తోందన్నారు. ఉత్తరాంధ్రలో ఉన్న పరిశ్రమలను మూసివేయడం వల్ల ఉత్తరాంధ్ర నుంచి కూలీలతో పాటు, నిరుద్యోగ యువత కూడా వలసలు పోతున్నారన్నారు. లక్షా 50వేల మందికి ఉపాధి కల్పిస్తూ, 3లక్షల కోట్లు విలువైన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను రూ.30వేల కోట్లకు అదానికి అమ్మేయాలని మోడీ ప్రభుత్వం చూస్తోందన్నారు. ఈ ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలంటే యువతంతా సంఘటితమై పోరాడాలన్నారు. నిరంతరం ప్రజా సేవలో ఉంటూ, సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న తాను పిడిఎఫ్ ఎమ్మెల్సీల స్ఫూర్తితో నిరాడంబరంగా, నిస్వార్థంతో ఉత్తరాంధ్ర హక్కుల కోసం, అభివృద్ధి కోసం, నిరుద్యోగ అభ్యర్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈనెల 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలలో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం నిరుద్యోగ యువతకు స్టడీ మెటీరియల్ అందచేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వెంకటేష్, పి.రామ్మోహన్, డివైఎఫ్ఐ నాయకులు హరీష్, పావని ,యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్ కె ఈశ్వరరావు, నిరుద్యోగ అభ్యర్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రాగోలులో ఇంటిగ్రేటెడ్ సైనిక భవన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో ఇంటిగ్రేటెడ్ సైనిక భవన్‌కు శ్రీకాకుళం రూరల్ మండలం రాగోలులోని సర్వే నంబరు 277/2ఎలో 73 సెంట్ల భూమిని ప్రభుత్వం కేటాయించిందని మాజీ సైనికుల సమాఖ్య జిల్లా అధ్యక్షులు పూర్ణచంద్రరావు కటకం తెలిపారు. కేటాయించిన భూమిలో మాజీ సైనికుల సమాఖ్య జాయింట్ సెక్రటరీ హవల్దార్ పి.మురళీధరరావు చేయించిన నాలుగు బోర్డులను జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఎ.శైలజ సమక్షంలో ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ సైనిక భవన్‌లో సైనికులకు, వీర మాతలకు, మాజీ సైనికుల కుటుంబ సభ్యులకు అవసరాలకు తగ్గట్టుగా ఇసిహెచ్ఎస్ పోలిక్లినిక్, జిల్లా సైనిక సంక్షేమ భవనం, క్యాంటీన్, సైనిక ఆరామ్ ఘర్ ఉంటాయని తెలిపారు. ఈ భూమి మంజూరు కావడానికి కారణమైన ప్రతిఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. దీనివల్ల జిల్లాలో ఏ సైనికుడైనా, మాజీ సైనికుడైనా, వారి కుటుంబ సభ్యులకైనా అన్ని అవసరాలు ఒకే దగ్గర తీరుతాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో భవనం నిర్మించనున్నట్లు చెప్పారు. దీంతో జిల్లాలో సైనికులకు, మాజీ సైనికులకు ఒక ప్రత్యేక గుర్తింపు వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సైనికుల సమాఖ్య చైర్మన్ గ్రూప్ కెప్టెన్ పి.ఈశ్వరరావు, ఇసిహెచ్ఎస్ అధికారి విశ్రాంత కల్నల్ ఎం.నారాయణరావు, క్యాంటీన్ మేనేజర్ టి.కృష్ణారావు, సభ్యులు హానరరీ కెప్టెన్ ఎస్.లక్ష్మణరావు, హానరరీ కెప్టెన్ పి.రామారావు, సుబేదార్ చిన్నప్పన్న, సుబేదార్ బి.మూర్తి, హవల్దార్ టి.జనార్థన, సైనిక సంక్షేమ కార్యాలయ సూపరింటెండెంట్ ఎస్.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# 'అమృత్ భారత్'లో శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్

- మౌలిక సదుపాయాలకు పెద్దపీట
- వాల్తేరు డిఆర్ఎం అనూప్ కుమార్ శతపతి

శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్‌లో పర్యటిస్తున్న డిఆర్ఎం అనూప్ కుమార్ శతపతి

ప్రజాశక్తి - ఆమదాలవలస, టెక్కలి

కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ పథకం కింద శ్రీకాకుళం రోడ్డు (ఆమదాలవలస) రైల్వేస్టేషన్‌ను గుర్తించిందని వాల్తేరు డివిజన్ డిఆర్ఎం అనూప్ కుమార్ శతపతి తెలిపారు. శ్రీకాకుళం రోడ్డు, నౌపడ రైల్వే జంక్షన్ స్టేషన్లలో ప్లాట్‌ఫారాలు, బుకింగ్ కౌంటర్, పార్కింగ్ స్థలాలు తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్‌లోని విఐపి లాంజ్‌లో ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో 60 రైల్వేస్టేషన్లు ఉండగా, అందులో అమృత్ భారత్ పథకం కింద 16 రైల్వేస్టేషన్లను కేంద్ర ప్రభుత్వం గుర్తించిందన్నారు. అందులో శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్ ఒకటి అని తెలిపారు. ఈ పథకం కింద రైల్వేస్టేషన్‌కు ఇరువైపులా వెయిటింగ్ హాల్స్, విఐపి లాంజ్‌లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, లిఫ్టులు, టిక్కెట్ కౌంటర్లు, సర్క్యులేటింగ్ ఏరియా, పార్కింగ్ సెంటర్లు తదితర నూతన భవనాలు, సుందరీకరణ తదితర అభివృద్ధి పనులతో రైల్వేస్టేషన్‌ను ఆధునీకరించనున్నట్లు తెలిపారు. త్వరలోనే అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు చెప్పారు. నౌపడ ఆర్.ఎస్‌లో ప్రయాణికులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన గురించి అడిగి తెలుసుకున్నారు. రైల్వేస్టేషన్ల అభివృద్ధిలో భాగంగా సమగ్ర వివరాలతో నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేయనున్నామని చెప్పారు. రైల్వే ప్రయాణికులకు మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. పర్యటనలో ఎడిఆర్ఎం ఎస్.కె గుప్తా, టి.ఎం రావు, సుధీర్ కుమార్, చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ మల్లేశ్వరరావు, శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్ మాస్టర్ మొదలవలస రవి, చీఫ్ బుకింగ్ సూపర్‌వైజర్ ఎల్.శివశంకర్, రైల్వే అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహిళా ఆరోగ్యం ముఖ్యం

## జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి మీనాక్షి

సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ మీనాక్షి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబ సంరక్షణ సాఫీగా ముందుకు సాగుతుందని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ పక్షోత్సవాల సందర్భంగా జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యాన నగరంలోని ఆర్ట్స్ కళాశాల నుంచి అంబేద్కర్ కూడలి వరకు మారథాన్ సైకిల్ ర్యాలీని ఆదివారం నిర్వహించారు. ఈ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. మహిళలు వారి దైనందిన జీవితంలో భాగంగా సైక్లింగ్ తప్పనిసరిగా చేయాలని సూచించారు. ఇది ఏరోబిక్ వ్యాయామం కాబట్టి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుందన్నారు. గుండెకు ఆక్సిజన్ కలిగిన రక్తాన్ని సరఫరా చేయడానికి సైక్లింగ్ దోహదపడుతుందని చెప్పారు. సైకిల్ తొక్కడం వల్ల రక్తనాళాలు, ఊపిరితిత్తులు బాగా పనిచేస్తాయని తెలిపారు. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సైక్లింగ్ సహాయపడుతుందన్నారు. మహిళా సాధికారత సాధన దిశగా అడుగులు వేయాలని కోరారు. ర్యాలీలో నెహ్రూ యువ కేంద్రం కోఆర్డినేటర్ కె.వి ఉజ్వల్, సెట్‌శ్రీ సిఇఒ బి.వి ప్రసాదరావు, పర్యాటక శాఖ జిల్లా అధికారి ఎన్.నారాయణరావు, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ పి.జగన్మోహనరావు, మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, జి.వి లక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్స్ మోహిని, స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు ఎస్.జోగినాయుడు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు వావిలపల్లి జగన్నాథం నాయుడు, పొన్నాడ రవికుమార్, వాకర్స్ మాజీ గవర్నర్ జి.ఇందిరా ప్రసాద్, బ్యాడ్మింటన్ కోచ్ కిల్లి ఢిల్లేశ్వరరావు, బాక్సింగ్ కోచ్ ఎం.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# గురుకులాల్లో ప్రవేశాలకు వేళాయె

- వచ్చే నెల 23న ప్రవేశ పరీక్ష
- ఐదో తరగతి, ఇంటర్‌లో దరఖాస్తుకు గడువు 24
- గురుకులాల సమన్వయ అధికారి జి.గ్రేస్

జి.గ్రేస్
గురుకులాల సమన్వయాధికారి




ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పేద, మధ్య తరగతి, అల్పాదాయ సామాజిక తరగతులకు చెందిన ఎస్, ఎస్‌టి, ఈబిసి విద్యార్థులు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులాల్లో ఐదో తరగతి, ఇంటర్‌లో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురుకులాల సమన్వయ అధికారి జి.గ్రేస్ తెలిపారు. సీట్ల భర్తీకి చేపట్టిన చర్యలు, రిజర్వేషన్ల కేటాయింపు, విద్యార్థులకు ప్రవేశాలకు కావాల్సిన అర్హతలు, వారికి కల్పిస్తున్న సదుపాలను ప్రజాశక్తి ముఖాముఖిలో ఆమె వివరించారు.

**జిల్లాలో వచ్చే విద్యా సంవత్సరంలో సీట్ల భర్తీకి ఎలాంటి చర్యలు చేపట్టారు?**

కార్పొరేట్ తరహాలో 2023-24 ఏడాదిలో ఐదదో తరగతి, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు కోరాం. పారదర్శకంగా ఈ సీట్ల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అర్హులైన వారికి మాత్రమే ఇందులో చేరేందుకు అవకాశం కల్పించాం. ప్రభుత్వం ఆధ్వర్యాన నిర్వహిస్తున్న అంబేద్కర్ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతిలో ఇంగ్లీష మీడియంలో చదివేందుకు వీలుగా ఈ ఎంపికలు చేయనున్నాం. ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి బాల, బాలికల నుంచి దరఖాస్తులు కోరాం. ప్రవేశ పరీక్ష ద్వారా సీట్ల భర్తీకి ఎంపిక జరుగుతుంది.

**ప్రవేశానికి దరఖాస్తులు ఎప్పటి నుంచి స్వీకరించనున్నారు?**

జిల్లాలో ఉన్న తొమ్మిది గురుకులాల్లో చేరేందుకు అర్హులైన అభ్యర్థులు గత నెల 25 నుంచి ఈనెల 24వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు వీలు కల్పించాం. 5వ తరగతి ప్రవేశానికి http://apgpcet.apcfss.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు http://apgpcet.apcfss.in/Inter సైట్‌ను సందర్శించాలి. లేదా, అంబేద్కర్ గురుకుల విద్యాలయాల ప్రధానాచార్యులను సంప్రదించాలి. బాల, బాలికలకు ప్రవేశ పరీక్ష నిర్వహించి, అందులో ఉత్తీర్ణత సాధించిన మార్కుల ఆధారంగా వారికి సీట్లు కేటాయిస్తాం. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు వారి విద్యార్హతతో పాటు ప్రవేశ పరీక్షకు తప్పనిసరిగా హాజరు కావాల్సి ఉంటుంది. ఈ పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా రిజర్వేషన్ ప్రాతిపదికన సీట్లు భర్తీ చేస్తాం.

**ప్రవేశ పరీక్ష ఎప్పుడు నిర్వహిస్తున్నారు.**

జిల్లాలోని గురుకులాల్లో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు దరఖాస్తు చేసుకున్న వారు తప్పని సరిగా ప్రవేశ పరీక్షలో మెరుగైన ఫలితాలు సాదించాల్సి ఉంటుంది. పోటీ పరీక్షలో వచ్చిన మార్కులు, రిజర్వేషన్ ఆధారంగా సీట్ల భర్తీ ఉంటుంది. అందులో భాగంగా ప్రవేశ పరీక్ష వచ్చే నెల 23న నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు ఐదో తరగతి ప్రవేశ పరీక్ష, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో చేరే విద్యార్థులకు ప్రవేశ పరీక్ష ఉంటుంది.

**5వ తరగతి ప్రవేశానికి ఏయే అర్హత కలిగి ఉండాలి.?**

ఐదో తరగతి ప్రవేశానికి ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు 01.09.2010 నుంచి 31.08.2014 మధ్య జన్మించిన వారై ఉండాలి, ఒసి, బిసి, ఎస్‌సి కన్వెర్టెడ్ క్రిస్టియన్ విద్యార్థులు 1.09.2012 నుంచి 31.08.2014 మధ్య జన్మించిన వారై ఉండాలి. సొంత జిల్లాలో ఉన్న వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. అర్హులైన విద్యార్థులు జిల్లాలో 2021-2022 విద్యాసంవత్సరంలో 3వ తరగతి, 2022-2023 విద్యాసంవత్సరంలో 4వ తరగతి ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదివి ఉండాలి. విద్యార్థి తల్లి, తండ్రి/సంరక్షకుల వార్షిక ఆదాయం(2022-23) రూ.లక్షకు మించకూడదు. విద్యార్థులు దగ్గరలో ఉన్న నెట్ సెంటర్‌లో గానీ, లేదా దగ్గరలో ఉన్న సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయాలలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకునేందుకు ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు. ఒకసారి విద్యార్థి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన తరువాత వాటిలో తిరిగి ఎటువంటి మార్పులు చేసేందుకు వీలుండదు. అందువల్ల ప్రతి ఒక్కరూ ఎంతో జాగ్రత్తగా దరఖాస్తులను పూర్తి చేసి అప్‌లోడ్ చేయాలి.

**జిల్లాలో బాల, బాలికల గురుకులాలు ఎక్కడెక్కడు ఎన్నాయి?**

జిల్లాలో తొమ్మిది కేంద్రాల్లో ప్రభుత్వం గురకులాలను ఏర్పాటు చేసింది. ఎచ్చెర్ల మండలం దుప్పలవలస, కంచిలి, బూర్జ మండలం కొల్లివలసలో బాలురు గురుకులాలు ఉన్నాయి. ఎచ్చెర్ల, పెద్దపాడు, తామరాపల్లి, నందిగాం, పాతపట్నం, మందసలో బాలికల గురుకులాలు నిర్వహిస్తున్నాం. అన్ని గురుకుల విద్యాలయాల్లో ఎస్‌సి 75శాతం, ఎస్‌సి కన్వెర్టెడ్ క్రిస్టియన్ 12 శాతం, ఎస్‌టి 6శాతం, బిసి 5శాతం, ఇతరులకు 2శాతం సీట్లు ప్రభుత్వం కేటాయించింది. ఈ ప్రాతిపదికనే సీట్లు భర్తీ చేయడం జరుగుతుంది. ఉత్సాహ వంతులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి.

# రాష్ట్రానికి పారిశ్రామికవేత్తల క్యూ

- సిఎం జగన్‌పై నమ్మకంతోనే పెట్టుబడుల ప్రవాహం
- శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై విశ్వాసం, పారిశ్రామిక విధానం వల్ల రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు క్యూ కడుతున్నారని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. నగరంలోని ఒక హోటల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖలో రెండు రోజుల పాటు నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో రూ.13,41,734 కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు ప్రవాహంలా వచ్చాయన్నారు. దేశ చరిత్రలోనే ఈ సమ్మిట్ ముఖ్యమైందన్నారు. సిఎం జగన్‌పై ఉన్న నమ్మకంతోనే ఈ సమ్మిట్‌కు అంబానీ, అదానీ, అపాచీ మిట్టల్, జిఎంఆర్ తదితర దిగ్గజ పారిశ్రామికవేత్తలు హాజరయ్యారని తెలిపారు. గత ప్రభుత్వాలు పారిశ్రామికవేత్తలను ఆకట్టుకునేందుకు ఇటువంటి సమ్మిట్‌లను నిర్వహించినా ఒప్పందాలు కుదుర్చుకుని వెనక్కి వెళ్లిపోయారని, వైసిపి ప్రభుత్వంపై పూర్తి విశ్వాసంతో రూ.13.41,734 కోట్ల పెట్టుబడులు పెట్టడానికి ఒప్పందాలు కుదుర్చుకున్నారని చెప్పారు. దీనివల్ల రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని చెప్పారు. ఎన్నో ఏళ్లుగా ఉపాధి అవకాశాల కోసం ఎదురుచూసే యువత కల నెరవేరేందుకు ఈ సమ్మిట్ దోహదపడుతుందన్నారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం నిర్వహించిన సమ్మిట్‌ల్లో అంబానీని ఎప్పుడైనా రప్పించగలిగారా అని ప్రశ్నించారు. టిడిపి ప్రభుత్వ హయాంలో కుదుర్చుకున్న ఒప్పందాల్లో ఒక్కటీ అమలు కాలేదని ఆరోపించారు. చంద్రబాబును నమ్మే స్థితి పారిశ్రామికవేత్తల్లో లేకపోవడం వల్లే రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు కాలేదన్నారు. దావోస్ వెళ్లి సూటు, బూటు వేసుకుని హంగామా చేశారే తప్ప సాధించింది ఏమిటని ప్రశ్నించారు. గత ప్రభుత్వ ఒప్పందాలు వైసిపి ప్రభుత్వం రద్దు చేయలేదని, నాటి ఒప్పందాల కాలపరిమితి ముగియడం వల్లే రద్దయ్యాయన్నారు. బడా పారిశ్రామికవేత్తలను విశాఖకు తీసుకురావడం, వారితో వాస్తవ ఒప్పందాలు చేసుకోవడం జగన్‌కే సాధ్యమైందన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడులకు అనుకూల పరిస్థితులను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. ఎవరో చెప్తే పారిశ్రామికవేత్తలు సమ్మిట్‌కి రారని, స్థిరమైన ప్రభుత్వం, బలమైన నమ్మకం కలగడం వల్లే పారిశ్రామికవేత్తలు ఇక్కడ పెట్టుబడి పెట్టడానికి ముందుకొచ్చారని చెప్పారు. ఈ సమ్మిట్‌లోనూ విశాఖ రాజధాని కాబోతోందని ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి వేదికపై స్పష్టం చేశారని తెలిపారు. ఇక రాష్ట్ర రాజధాని విశాఖ మారబోతుందన్నారు. సమావేశంలో వైసిపి నాయకులు పప్పల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో క్రీడాకారులతో రాజ్యలక్ష్మి

## తైక్వాండో బెల్ట్ ప్రమోషన్ టెస్ట్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

తైక్వాండో బెల్ట్ ప్రమోషన్ టెస్ట్ ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, టౌన్ ఎస్ఐ గోవిందరావు విజేతలకు బెల్ట్ ప్రమోషన్ అందించారు. వైట్ బెల్ట్ నుంచి ఎల్లో బెల్ట్‌కు 30 మంది, ఎల్లో నుంచి గ్రీన్ బెల్ట్‌కు ఎనిమిది మంది, గ్రీన్ బెల్ట్ నుంచి బ్లూ బెల్ట్‌కు 8 మంది, రెడ్ వన్ ప్రమోషన్‌కోసం 13 మంది, మొత్తం 59 మంది పిల్లలు ఈ ప్రమోషన్ టెస్ట్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలరు పిలక విజయ భాస్కర్‌రెడ్డి, సుగ్గు ప్రేమ్‌కుమార్, కె.దిలీప్, తాడి ఆదిరెడ్డి, ఎపి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శివప్రసాద్, పిటి అసోసియేషన్ ప్రెసిడెంట్ కృష్ణయ్య, పేరంట్స్ కమిటీ సభ్యులు గిరిబాబు, ఎ.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

## శ్రీశైలంలో అలరించిన నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

శ్రీ స్వేచ్ఛా నృత్య తరంగిణి కూచిపూడి, భరతనాట్యం, జానపద నాట్య శిక్షణాలయం కళాకారులకు అరుదైన గౌరవం లభించింది. శ్రీశైలం దేవస్థానంలో ధర్మపథం నిత్య కళారాధన సాంస్కృతిక కార్యక్రమంలో ఇచ్ఛాపురం నృత్యకళాకారుల అద్భుతమైన నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. నాట్య గురువు మంగి దివ్య. కె.కుమార్. కె.సూర్య. బి.భవానీ. పి.సంగిత. జి.భార్గవి. పి.వర్షిత. ఎస్.భార్గవి. పి.శ్రీహిత. టి.చంద్ర లహరి పాల్గొన్నారు. వీరు ప్రదర్శించిన శివా తాండవం.. ఆనందతాండవం, శివా శివా శంకరా.. శివా దారం.. నమొ నమొ రగుకు నాయక, అయిగిరినందిని పాటలకు అధికారులు, కళాపోషకుల నుంచి అభినందనలు వచ్చాయి. అకాడమీ అధ్యక్షులు కె.గోవిందరావు, కోశాధికారి మంగి దలమ్మకు ప్రశంసా పత్రాలు, స్వామి వారి ప్రసాదం అధికారుల చేతుల మీద అందించారు. శ్రీశైల దేవస్థానంలో నాట్య ప్రదర్శనలు చేయటం అదృష్టంగా భావిస్తున్నామని అకాడమీ అధ్యక్షులు గోవిందరావు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన అవసరం

**టెక్కలి:** మారుతున్న కాలానికి అనుగుణంగా సమాజంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయని, వీటిలో భాగంగా మహిళల జీవన వికాసంలో కూడా మార్పులు జరుగుతున్నాయని, ఇటువంటి తరుణంలో మహిళా చట్టాలపై అవగాహన కల్పించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని యువ న్యాయవాదులు పేడాడ చంద్రశేఖర్ ఆజాద్, రెయ్యి ప్రభుచంద్ అన్నారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఉన్న రోగులకు, సిబ్బందికి, సివిల్ జడ్జి టి.హరిత సూచనల మేరకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు బాల్య వివాహలను నిరోదించాలని, కార్యాలయాల్లో విధులు నిర్వర్తించే మహిళపై లైంగిక వేదింపులు జరుగుతుంటాయని, గృహహింస చట్టం ఆమలు వంటి అంశాలపై ఆవగాహన కల్పించి పోలీస్‌లకు సమాచారం అందివ్వాలని కోరారు. సామాన్య, మధ్య తరగతి కుటుంబాల వారికి న్యాయం ఉచితంగా అందిస్తామని ఆజాద్, ప్రభుచంద్‌లు అన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

ప్రజాశక్తి- టెక్కలి

లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం నేరమని టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి టి.హరిత అన్నారు. స్థానిక గిరిజన బాలికల వసతిగృహంలో ఆదివారం విద్యార్థినులకు న్యాయ సేవాసాధికార సంస్థ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మగ పిల్లలతో పాటు ఆడ పిల్లలు కూడా సమానంగా పెరగాలని అన్నారు. ఆడ పిల్లలకు జన్మనివ్వకుండా భ్రూణ హత్యలకు పాల్పడుతున్నారని, వీటిని నిరోధించాలని కోరారు. గృహ హింస చట్టం ద్వారా పురుషుల నుంచి మహిళలకు రక్షణ కల్పించుకోవచ్చని అన్నారు. చట్టాలపై అవగాహన పెంచుకుని హక్కులకు భంగం కలుగుకుండా చూడాలని పిలుపునిచ్చారు. విశ్రాంత ఉపాధ్యాయులు కోత ధర్మారావు మాట్లాడుతూ విద్యార్థినులు తమ చదువులతో పాటు ముందుగా లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని, తన విదుల్లో వారి హక్కులకు భంగం కలుగకుండా చూసుకోవాలని అన్నారు. గిరిజన సంఘ నాయకులు పెద్దింటి నేపాల్ మాట్లాడుతూ మహిళలపై సమాజంలో ఇంకా చిన్నచూపు చూస్తున్నారని అన్నారు. వీటిని రూపుమాపాలంటే మహిళలు చదువు పట్ల శ్రద్ధ చూపాలని కోరారు. వసతిగృహ వార్డెన్ దేవాది సునీత ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న హరిత

## రమాప్రభ గెలుపునకు విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - పొందూరు

ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్.అమ్మన్నాయుడు, విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కూన వెంకటరావు కోరారు. రమాప్రభను గెలిపించాలని కోరుతూ మండలంలోని గోరింట, తోలాపిలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రమాప్రభ గెలుపు ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధి కోసం, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి దోహదపడుతుందన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీలు రాజ్యాంగ విలువలకు కట్టుబడి, ప్రస్తుత కార్పొరేట్ రాజకీయాల్లోనూ నిజాయతీగా ఉంటూ ప్రజా సమస్యలపై పనిచేస్తున్నారని చెప్పారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు, రైతులు, కౌలు రైతులు, మహిళలు తదితరుల సమస్యలను శాసనమండలిలో వినిపించడమే గాక శాసన మండలి వెలుపల జరిగే ఆందోళనలకు మద్దతునిస్తున్నారని గుర్తుచేశారు. ప్రశ్నించే గొంతుకలను శాసనమండలికి పంపించాలని విజ్ఞప్తి చేశారు. సీరియల్ నెంబరు 11లో డాక్టర్ కోరెడ్ల రమాప్రభ ఎదురుగా మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

తోలాపిలో ప్రచారం చేస్తున్న సిఐటియు నాయకులు

## విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సిక్కోలు చేయూత సేవా సంఘం ఆధ్వర్యాన సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులకు ఆదివారం ప్రతిభా పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షలో ప్రతిభ కనబరచిన విద్యార్థులను ఎంపిక చేసి విజేతలుగా ప్రకటించారు. ప్రథమ స్థానంలో ఆక్స్‌ఫర్డ్ స్కూల్ విద్యార్థి జశ్వంత్ ప్రథమ స్థానంలో నిలిచాడు. కె.తేజశ్రీ, సిహెచ్.కార్తీక్‌లు, ఎస్.వైష్ణవి విజేతలుగా నిలిచారు.

విజేతలుగా నిలిచిన విద్యార్థులు

## ప్రశాంతంగా ప్రజ్ఞా వికాస పరీక్ష

జి.సిగడాం : ప్రజ్ఞ వికాస్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

**జి.సిగడాం:** మండలంలోని సంతవురిటి ప్రభుత్వ హైస్కూల్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ఆదివారం పదో తరగతి విద్యార్థులకు ప్రజ్ఞా వికాస పరీక్ష నిర్వహించారు. విద్యార్థుల్లో భయాందోళనలు పోగొట్టేందుకు ఇలాంటి పరీక్షలు రాష్ట్రం వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన నిర్వహిస్తున్నామని పొందూరు మండల కార్యదర్శి గణేష్ తెలిపారు. ఎస్ఎఫ్ఐ అంటే కేవలం పోరాటాలు మాత్రమే కాదు, విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంచే దిశలోనూ, అలాగే వారికి సమాజంపై అవగాహన పెంచే విధంగా స్టడీ సర్కిల్, తరగతులు పెడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు సంధ్య పాల్గొన్నారు.

**కొత్తూరు :** కొత్తూరులోని ప్రభుత్వ హైస్కూల్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన పదో తరగతి విద్యార్థులకు ప్రజ్ఞ వికాస పరీక్ష నిర్వహించారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతున్న తరుణంలో ఎస్ఎఫ్ఐ నిర్వహిస్తున్న మోడల్ పరీక్ష ఎంతగానో ఆదరిస్తూ... విద్యార్థులు చురుగ్గా పాల్గొన్నారు. ఈ మేరకు విద్యార్థులను ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.హరీష్ అభినందించారు.

## ఉత్సాహంగా ఫెన్సింగ్ పోటీలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని టౌన్ హాల్‌లో ఆదివారం జిల్లాస్థాయి సీనియర్ ఫెన్సింగ్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ పోటీలను న్యాయవాది, సీనియర్ క్రీడాకారుడు ఎన్.విజయ్‌కుమార్, వ్యాపార వేత్త బలభద్రుని రాజా, నారాయణశెట్టి కిరణ్‌కుమార్, తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి తైక్వాండో శ్రీను ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు వైశ్యరాజు మోహన్‌లు ప్రారంభించారు. సీనియర్స్ విభాగంలో పురుషులకు, మహిళలకు వేర్వేరుగా ఈ పోటీలను నిర్వహించారు. ప్రారంభ కార్యక్రమంలో విజయ్‌కుమార్ మాట్లాడుతూ క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఉందన్నారు. క్రీడాకారులకు అన్ని రంగాల్లో ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు. గెలుపు, ఓటములను పక్కన పెట్టి క్రీడాకారులు నిరంతరం సాధన చేయాలన్నారు. శిక్షకుల వద్ద మెలకువలను నేర్చుకుని క్రీడా పోటీల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో జి.వెంకటేశ్వరరావు, ఎం.సుధీర్‌వర్మ, సంపతిరావునాయుడు, గురుగుబెల్లి ప్రసాద్ ,బెవర జ్యోతిప్రసాద్, టంకాల కృష్ణ పాల్గొన్నారు.

పోటీ పడుతున్న క్రీడాకారులు

### రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

జిల్లాస్థాయి సీనియర్ ఫెన్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులు ఈ నెల 11,12 తేదీల్లో కాకినాడ వేదికగా నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సీనియర్ పోటీలకు ఎంపికయ్యారు. పురుషుల్లో ఫోయిల్ విభాగం నుంచి గౌతమ్ చంద్ర, కె.సాయి ప్రీతమ్, ఎస్.మురళీకృష్ణ, ఎం.చైతన్యసాయిలు, ఇప్పీ విభాగంలో ఎస్.రోహిత్‌రాజ్, జి.సంజయ్, సిహెచ్.జ్ఞానసాగర్, ఎస్.చరణ్‌తేజలు, సాబర్ విభాగంలో జి.సాయి ప్రదీప్‌లు ఎంపికయ్యారు. అలాగే మహిళల్లో ఫోయిల్ విభాగంలో జి.అక్షయ, బి.పూజిత, సిహెచ్.చాందిని, ఎస్.నవ్యలు, సాబర్ విభాగంలో కె.అనిశ్రీ, బి.జాహ్నవి సాయి కిరణ్మయి, ఎం.బ్లెస్సీ రీచెల్, ఎం.శ్రీమనస్వీలు ఎంపికయ్యారు.

## క్రైమ్ కార్నర్

మృతి చెందిన కోటేశ్వరరావు

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

జె.ఆర్.పురం పోలీస్ స్టేషన్ పరిధిలో 16 నంబరు జాతీయ రహదారి పైడిపేట వద్ద ఆదివారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు... శ్రీకాకుళం నగరం అరవసల్లికి చెందిన కళ్లేపల్లి కోటేశ్వరరావు (64) ఆంధ్రాబ్యాంకులో పనిచేసి నాలుగేళ్ల రిటైర్ అయ్యారు. మృతుడి కుమారుడు కుమార్ విశాఖపట్నంలో వ్యాపారం చేసుకుంటున్నాడు. కుమారుడిని చూసేందుకు రెండు రోజుల క్రితం విశాఖపట్నం బైక్‌పై వెళ్లాడు. తిరిగి వస్తుండగా... పైడిపేట వద్ద హైవే పక్కన ఉన్న రెలింగ్‌కు బైక్ తగిలి బోల్తా పడ్డాడు. హెల్మెట్ పెట్టుకున్నా... తలకు తీవ్ర గాయం కావడంతో ప్రమాదస్థలంలోనే మృత్యువాత పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా సర్వజనా స్పత్రికి తరలించారు. మృతుడికి భార్య రామలక్ష్మి ఉన్నారు. ఎస్ఐ జి.రాజేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### యువకుడు ఆత్మహత్య

**రణస్థలం రూరల్ :** మండల కేంద్రం జె.ఆర్.పురంలో ఉరి వేసుకొని లక్ష్మీనరసింహపాత్రో (24) అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు... టెక్కలిపట్నంకు చెందిన లక్ష్మీనరసింహపాత్రో రెడ్డిస్ లేబొటరీస్‌లో క్యూ-ఎగా పనిచేస్తున్నాడు. గత నెల రోజులుగా అద్దె భవనం తీసుకుని ఉంటున్నాడు. శనివారం ఒంటి గంటకు బి-షిఫ్ట్‌కు వెళ్తున్నానని బాధతో తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పాడు. అప్పటి నుంచి తల్లిదండ్రులు, తమ్ముడు ఫోన్ చేసినా స్పందన లేదు. దీంతో తండ్రి రాజా కిషోర్‌పాత్రో, తమ్ముడు నిలమణి పాత్రో ఆదివారం 12 గంటలకు జె.ఆర్.పురంలోని ఇంటికి వెళ్లి చూశారు. ఇంట్లో క్లాత్‌తో ఉరి వేసుకొని ఉండడంతో లబోదిబోమంటూ పోలీసులకు సమాచారం అందజేశారు. ఎస్ఐ రాజేష్ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. సూసైడ్ నోట్‌లో నా చావుకి ఎవరు కారణం కాదని, తల్లిదండ్రులు క్షమించమని రాసినట్టు ఉందని ఎస్ఐ తెలిపారు. కుటుంబ సభ్యుల సమక్షంలో శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా సర్వజనాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### జూదరులు అరెస్టు

**కొత్తూరు :** మండలంలోని కర్లెమ్మ పంచాయతీ మహాసింగి గ్రామ సమీపంలోని ఓ మామిడి తోటలో పేకాట ఆడుతున్న జూదర్లను ఆదివారం అరెస్టు చేశామని ఎస్ఐ ఎం.గోవింద్ తెలిపారు. కొద్ది రోజులుగా పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించామని పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ.14,800 నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. సొంది రాజు, దీర్ఘాసి డాలిరాజు, నిమ్మక రామారావుతో మరో ఐదుగురిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించామని తెలిపారు.

### వరికుప్ప దగ్ధం

**పలాస :** మండలంలోని రాజగోపాలపురం గ్రామానికి చెందిన రైతు కంచరాన కామేషుకు చెందిన వరి చేను కుప్ప శనివారం రాత్రి అగ్నికి ఆహుతైంది. అదే గ్రామానికి చెందిన కంచరాన పాపారావు తన చేనుకు నిప్పు పెట్టడం వల్ల కాలిపోయిందని రైతు ఆరోపిస్తున్నాడు. రూ.90వేలు నష్టపోయానని, తనను ఆదుకోవాలని కోరాడు. ఈ ఘటనపై కామేషు కాశీబుగ్గ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు.

### గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

**లావేరు :** లావేరు శాఖాగ్రంథాలయంలో ఆదివారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో బాలసా హిత్యం, జాతీయ నాయకుల జీవిత చరిత్రలు, చిన్నపిల్లల పుస్తకాలను విద్యార్థులు చదివారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు మాట్లాడు తూ ప్రతి నెలా మొదటి ఆదివారం పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డియ్య, పాఠకులు పాల్గొన్నారు.

పుస్తకాలను చదువుతున్న విద్యార్థులు

## గెలిపించండి తోడుగా ఉంటా

మాట్లాడుతున్న నర్తు రామారావు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సహకరించి, గెలిపిస్తే తోడుగా ఉంటానని ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావు అన్నారు. ఆదివారం ముత్యాలమ్మపేటలో పిలక మీనకేశ్వరరావు గృహంలో మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, ఎంపిపి, జెడ్‌పిటిసి, ఎంపిటిసి సభ్యులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తనకు ఇచ్చిన అవకాశం సద్వినియోగం చేసుకోవాలంటే మీరంతా సహకరించి ఒకటో నెంబరుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నాలుగేళ్లుగా ప్రపంచంలో ఒక ఆదర్శమైన పరిపాలన అందిస్తున్నారని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారని చెప్పారు. తనను గెలిపిస్తే అందరకీ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి, సీడాప్ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, జిల్లా ప్రచార కమిటీ చైర్మన్ తాడి ఆదిరెడ్డి, వైస్ చైర్మన్‌లు ఉలాల భారతీదివ్య, లాభాల స్వర్ణమణి, ఎంపిపి బి.పుష్ప, పిఎసిఎస్ అధ్యక్షులు నర్తు నరేంద్ర యాదవ్, కడియల ప్రకాష్, సాలీనా ఢిల్లీ యాదవ్, ప్రకాశరావు పట్నాయక్, కె.మోహన్‌రావు, ఉప్పాడ రాజారెడ్డి, చిట్టిబాబు, వార్డ్ కౌన్సిలర్లు, ఎంపిటిసి సభ్యులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## స్వచ్ఛంద సేవలకు మానవత్వం మూలం

**శ్రీకాకుళం అర్బన్ :** మానవత్వం, స్పందించే గుణం ఉన్నప్పుడే తోటివారికి సాయపడాలన్న ఆలోచన కలుగుతుందని, స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సేవలు ఎంతగానో తోడ్పాటు అందిస్తున్నాయని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ నిమ్మ వెంకటరావు పేర్కొన్నారు. నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఉన్న సమావేశ మందిరంలో మానతవ స్వచ్ఛంద సేవా సంస్థను ఆదివారం ప్రారంభించారు. ఈ సంస్థకు నూతన చైర్మన్‌గా వ్యవస్థాపకుల్లో ఒకరైన ప్రొఫెసర్ విష్ణుమూర్తి, వైస్ చైర్మన్‌గా నటుకుల మోహన్‌లు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమని పేర్కొన్నారు. అందుకోసం మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. అలాగే ఎపి హైర్ ఎడ్యుకేషన్ రెగ్యులేట్ అండ్ మోనటరింగ్ వైస్ చైర్మన్ పి.విజయప్రకాష్, విశ్రాంత జెసి రజనీకాంతరావు, విశ్రాంత పోలీసు అధికారి భార్గవరావునాయుడు తదితరులు మాట్లాడారు. సేవలను విస్తృతపర్చడానికి ఎసి ఫ్రీజర్ బాక్సును సంస్థకు హైదరాబాద్‌కు చెందిన సురవరం మహేంద్రరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కో-ఆర్డినేటర్లు డాక్టర్ రాధాపుష్ప, డాక్టర్ సీతామాణిక్యం, సంస్థ గాజువాక చైర్మన్ కృష్ణంరాజు, గాజువాక డైరెక్టర్ సత్యారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విసి వెంకటరావు

## రాజగోపాలరావు జీవితం ఆదర్శం

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు సురేష్

**ఆమదాలవలస :** మాజీ ఎంపీ, కీర్తిశేషులు బొడ్డేపల్లి రాజగోపాలరావు జీవితం నేటి యువతకు ఆదర్శమని శ్రీకాకుళం సన్‌రైజ్ ఆస్పత్రి అధినేత బొడ్డేపల్లి సురేష్ అన్నారు. మండలంలోని అక్కులపేటలో రాజగోపాలరావు జయంతి సందర్భంగా ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 12 వరకు అన్నదానం, దుస్తుల పంపిణీ, పాఠశాల విద్యార్థులకు పుస్తకాల పంపిణీ వంటి వివిధ రకాల సామాజిక కార్యక్రమాలను రాజగోపాలరావును స్మరిస్తూ వారోత్సవాలను నిర్వహిస్తామని తెలిపారు. రాజకీయాలకతీతంగా ఆయన చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ఇప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోయాయని కొనియాడారు. ఈ సందర్భంగా సుమారు 300 మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డేపల్లి వసుమతి, ఎంపిటిసి బొడ్డేపల్లి సుగుణ, వైద్యులు శ్రీనివాస్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

జ్యోతీశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న పోస్టల్ ఉద్యోగులు, కుటుంబ సభ్యులు

## విద్యార్థి దశ నుంచే అభ్యుదయ భావాలు

### జ్యోతీశ్వరరావు ఆత్మీయ సమ్మేళనంలో పోస్టల్ ఉద్యోగులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గార విశ్రాంత పోస్టుమాస్టర్ జాని జ్యోతీశ్వరరావు విద్యార్థి దశ నుంచే అభ్యుదయ భావజాలంపై ఆకర్షితులై అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం (గ్రూప్-సి) జిల్లా అధ్యక్షులుగా, శ్రీకాకుళం డివిజన్ అధ్యక్షులుగా విశేష సేవలందించారని తపాల ఉద్యోగులు అన్నారు. గార పోస్టుమాస్టర్‌గా విధులు నిర్వహిస్తూ గత నెల 28న ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా అఖిల భారత తపాలా ఉద్యోగ సంఘాల ఆధ్వర్యాన నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఇందులో భాగంగా జ్యోతీశ్వరరావు దంపతులకు దుశ్శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎపి తపాలా ఉద్యోగుల సమాఖ్య కన్వీనర్, అఖిల భారత తపాలా ఉద్యోగ సంఘం (గ్రూప్-సి) రాష్ట్ర కార్యదర్శి బి.శ్రీధర్‌బాబు, అఖిల భారత పోస్టల్, ఆర్ఎంఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.నాగేశ్వరరావు మాట్లాడారు. జ్యోతీశ్వరరావు నాలుగు దశాబ్దాలుగా పోస్టల్‌శాఖలో నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయీస్ సంఘానికి అనేక సేవలు అందించారని అన్నారు. సిఐటియు సీనియర్ నాయకులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా సంఘాలు నిర్వహించే అనేక పోరాట కార్యక్రమాల్లో తనదైనశైలిలో పాల్గొని పేదల కష్టసుఖాల్లో సైతం పాలుపంచుకున్నారని అన్నారు. ఆయన చిరకాల మిత్రుడు, జిల్లా పర్యావరణ పరిరక్షణ సమితి నాయకులు డాక్టర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ జ్యోతీశ్వరరావు విద్యార్థి దశలోనే అభ్యుదయ భావాలను పుణికిపుచ్చుకుని ఇప్పటికీ భావజాలంతో జీవిత ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారని అన్నారు. జ్యోతీశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగ, సామాజిక జీవితంలో కుటుంబ సభ్యులు సహకారం ఎంతో తోడ్పాటు అందించిందన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు నారాయణరావు, విశ్వనాథం, జిల్లా నాయకులు గణపతి, బాబూరావు, నందికేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం శ్రీకాకుళం డివిజన్ అఖిల భారత పోస్టల్ ఆర్ఎంఎస్ పెన్షనర్స్ అసోసియేషన్‌ను నూతనంగా ప్రారంభించారు. ఈ సంఘానికి అధ్యక్ష, కార్యదర్శులుగా కె.వెంకటరావు, కె.చంద్రశేఖరరావులను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## 161 పశువులకు టీకాలు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

161 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు కోటబొమ్మాళి పశువైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్‌కుమార్ అన్నారు. జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఊడికలపాడు పంచాయతీలో ఊడికలపాడు, దుర్గంపేట, వరహాలంపేట గ్రామాలలో టీకాలు వేసినట్లు చెప్పారు. రాష్ట్రం మొత్తంగా ఈ నెల 1వ తేదీ నుండి 31వ తేదీ వరకు టీకాల కార్యక్రమం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం జరుగుతుందన్నారు. టీకాల కార్యక్రమం చల్లని వేళలో మాత్రమే చేయాలని, ఉదయం 6 నుంచి 9.30గంటల వరకు పశువైద్యాధికారి పర్యవేక్షణలో వేసుకోవాలి, 3 నెలలు దాటిన పశువులు అన్నింటికి టీకాలు వేయాలి, చూడు పశువులకు కూడా చేయవచ్చు. నిండు చూడు పశువులకు వేయకూడదన్నారు. తీవ్రమైన జ్వరం వచ్చి 104-106 డిగ్రీలు ఉంటుందని, నోటి నుండి తీగల మాదిరి చొంగ కారడం, నోటిలో, కాలి గిట్టల మధ్య పుండ్లు ఏర్పడటం, తిండి మందగించి నీరసించడం, చిన్న ఎండకు రొప్పడం, చుడి పశువులు ఈసుకుపోవటం, ఎద్దులలో పనిసామర్థ్యం తగ్గడం, తదితర లక్షణాలు ఉన్నాయని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకులు కుటికుప్పల ముకుందరావు, వైసిపి నాయకులు నెయ్యిల సురేష్ పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్ కిరణ్

### కల్వర్టు పనులు పూర్తి చేయాలి

**టెక్కలి:** టెక్కలి పంచాయతీరాజ్ రోడ్డు మార్గంలోని సంతోషిమాత గుడి వద్ద నిర్మాణం జరుగుతున్న కల్వర్టు పనులను త్వరితగతిన పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ ఎస్‌సిసెల్ నాయకులు కూరాకుల యాదవ్ కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నెల రోజుల క్రితం ప్రారంభించిన పనులు నేటి వరకు పూర్తికాకపోవడం వల్ల వాహనదారులు, ప్రయాణికులు, చిల్లర వ్యాపారస్తులు పలు అవస్థలకు, అ సౌకర్యానికి గురవుతున్నారని అన్నారు.

## అర్జీల స్వీకరణలో మార్పులు అవసరం

ప్రజాశక్తి - టెక్కలి

ప్రజా సమస్యల పరిష్కారంలో వినతులు స్వీకరణకు ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం కొంత సమయం కేటాయించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎపి దళిత మహాసభ జిల్లా అధ్యక్షులు బి.నారాయణరావు కోరారు. ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా జిల్లా, డివిజన్ కేంద్రాల్లో సోమవారం నిర్వహించే స్పందనకు ఆశించినంతగా ఫలితం కనిపించడం లేదన్నారు. ఈ మేరకు సిఎం జగన్‌కు ఆదివారం లేఖ పంపినట్లు తెలిపారు. వారంలో ఒక్కరోజే ఆధికారులు అందుబాటులో ఉండటం వల్ల కొన్ని సమస్యలే పరిష్కారానికి నోచుకోవడంతో పాటు పూర్తిస్థాయి లో సమస్యలు విన్నవించుకోలేకపోతున్నామని అన్నారు. గతంలో మాదిరిగా అధికారులు అందు బాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఒకే రోజు డివిజన్, జిల్లా స్థాయి అధికారుల వద్ద కు వెళ్లి వినతులు ఇవ్వడంతో ఇబ్బందికర పరిస్థి తులు ఉన్నాయన్నారు. దీనిపై సిఎం పరిశీలించి, అన్ని వేళల్లో అధికారులు జిల్లా కార్యా లయాల్లో అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు.

పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

## పాఠశాలల్లో పచ్చదనం ప్రతిబింబించాలి

**పొందూరు:** పాఠశాలల్లో పచ్చదనం ప్రతిబింబించే విధంగా మొక్కలు నాటి సంరక్షణ చేయాలని తాడివలస ఉన్నత పాఠశాల పాఠశాల ప్రధానోపాధ్యాయులు లఖినాన హేమనాచార్యులు అన్నారు. మండలంలోని తాడివలస ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులు తమ్మినేని జాహ్నవి, పైడి తరణ్య పుట్టిన రోజు సందర్భంగా ఆవరణలో శని, ఆదివారాల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. విద్యార్థుల పుట్టిన రోజుల సందర్భంగా మొక్కలను బహుమతిగా అందజేసి పర్యావరణ పరిరక్షణకు నిరంతరం కృషి చేయడంపై విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు రావాడ పాపారావు, వ్యాయామ ఉపాధ్యాయులు పైడి సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.